సాక్షి
హనుమకొండ

ఆదివారం । 24 । సెప్టెంబర్ । 2023



మళ్లీ మొదటికి.. - 8లో▸

గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ మళ్లీ మొదటికి వచ్చిం ది. గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్ రద్దు చేస్తు న్నాం. మళ్లీ రాయాలని హైకోర్టు తీర్పు ఇవ్వడం తో అభ్యర్థులు కన్నీరుమున్నీరవుతున్నారు.



పేదల వ్యతిరేక ప్రభుత్వాలను...

పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
32°/24°

వాతావరణం

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండగా ఉంటుంది. సాయంత్రం చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రేపట్నుంచి డీఎల్ఈడీ, డీపీఎస్ఈ సెకండియర్ పరీక్షలు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో ఈనెల 25వ తేదీ నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు డీఎల్ఈడీ, డీపీఎస్ఈ రెండో సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈఓ అబ్దుల్‌హై, జిల్లా ఏసీజీ చలపతిరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు.

అక్టోబర్ 1న చెస్ పోటీలు

హన్మకొండ: తెలంగాణ రాష్ట్ర చెస్ అసోసియేషన్ సహకారంతో వరంగల్ జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్ 1వ తేదీన హనుమకొండ ములుగురోడ్ సమీపంలోని శరణ్యగార్డెన్ నందు జిల్లాస్థాయి చదరంగ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కార్యదర్శి కన్నా.. శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–09, 13, 15 బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రతిభ కనబర్చిన నలుగురు బాలికలు, నలుగురు బాలురను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు పేరు నమోదుకు 90595 22986 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

26న ఐలమ్మ జయంతి

కాజీపేట అర్బన్: ఈనెల 26న వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు బీసీ వెల్ఫేర్ డీడీ రాంరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు హంటర్ రోడ్డు న్యూశాయంపేటలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జీఓ 142 రద్దు చేయాలని రేపు ధర్నా



ఎంజీఎం : వైద్యారోగ్యశాఖలోని జీఓ 142 రద్దు చేయాలని డాక్టర్లు, పారామెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుల పిలుపు మేరకు సోమవారం హనుమకొండ, వరంగల్ డీఎంహెచ్‌ఓ కార్యాలయాల ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు జీఓ రద్దు స్టీరింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ జీఓ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 4 వేలకు పైగా పోస్టులు రద్దు చేయడానికి అవకాశం ఉందన్నారు. అందుకే దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బానోతు నెహ్రూచంద్ నాయక్, యాదా నాయక్, మాధవరెడ్డి, రవీందర్, మధుసూదన్ రెడ్డి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీహేరంబగణపతిగా పూజలు



హన్మకొండ కల్చరల్ : శ్రీరుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో జరుగుతున్న శ్రీ ఉత్తిష్ట నవరాత్రి మహోత్సవాలు శనివారం ఆరో రోజుకు చేరుకున్నాయి. మూల మహాగణపతికి గంధవిలేపనాలు అద్ది చతుర్ముఖాలతో శ్రీహేరంబగణపతిగా అలంకరించారు. ఆలయ ప్రధానార్చకులు గంగు ఉపేంద్రశర్మ అధ్వర్యంలో కంజుల మహేశ్ దాతగా యాగశాలలో గణపతి రుద్రహోమం నిర్వహించారు. అనంతరం పంచలోహ ఉత్సవ మూర్తిని సింహ వాహనంపై ప్రతిష్ఠించి దేవాలయం చుట్టూ ఊరేగించి వాహన సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో గాయత్రి గ్రానైట్స్ అధినేత వద్దిరాజు వెంకటేశ్వరరావు దంపతులు పాల్గొన్నారు. సత్యమూర్తి సౌజన్యంతో అన్నప్రసాదాల వితరణ చేశారు. ఈఓ వెంకటయ్య పర్యవేక్షించారు. పరమేశ్వర్ శిష్య బృందం చేసిన కూచిపూడి నృత్యాలు అలరించాయి.

ఇద్దరు తహసీల్దార్లకు స్థానచలనం

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లకు స్థానచలనం కల్పిస్తూ కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మక్బుల్‌ను హనుమకొండ ఆర్డీఓ కార్యాలయం డీఏఓగా, అక్కడ పని చేస్తున్న శైలజను కలెక్టరేట్ సూపరింటెండెంట్‌గా నియమించారు. వీరితోపాటు కమలాపూర్, ఎల్కతుర్తి, హనుమకొండ మండలాల్లోని సీనియర్ అసిస్టెంట్లకు స్థానచలనం కల్పించారు.

పారిశుద్ధ్య లోపం.. ప్రజలకు శాపం

- ఆక్రమణలతో కాల్వలు మాయం
- అస్తవ్యస్తంగా డ్రెయినేజీ వ్యవస్థ
- పనిభారంతో పట్టించుకోని పారిశుద్ధ్య సిబ్బంది
- సీజనల్ వ్యాధులతో వణుకుతున్న జనం



ఈ ఫొటోలో కనిపిస్తున్నది గడ్డం వాడ. 3వ వార్డులో ఉండే ఈకాలనీ పక్కనే ఎన్‌హెచ్ 353 రహదారి ఉంది. రోడ్డు నిర్మాణ సమయంలో సదరు కాంట్రాక్టర్ కొత్తగా డ్రెయినేజీ నిర్మించారు. అయితే గతంలో ఉన్న డ్రెయినేజీ వంపుగా ఉంది. నూతనంగా ఎత్తుగా నిర్మించడంతో ఎగువ ప్రాంతం నుంచే వచ్చే నీరు ఈకాలనీలోకి చేరుతోంది. ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో ఈనీరు నిలుస్తోంది. రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దోమలు పెరిగి కాలనీవాసులు రోగాల బారినపడుతున్నారు.

పరకాల: ఆక్రమణలతో కాల్వలు కనుమరుగైపోయాయి. చినుకు పడితే చాలు పరకాల పట్టణం చిత్తడిగా మారుతోంది. ప్రధాన రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు జలమయమవుతున్నాయి. కళ్ల ఎదుట ఆక్రమించుకుంటున్నా.. కొందరు పాలకవర్గ సభ్యులు చూసీచూడనట్లుగానే వ్యవహరించారు. దీంతో పట్టణంలో ఎక్కడ చూసినా మురికి నీళ్లు నిలిచి కుంటల్ని తలపిస్తున్నాయి. పందులు, దోమలు, ఈగలు స్వైర విహారం చేస్తున్నాయి. సీజనల్ వ్యాధులతో పట్టణ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పరకాల మున్సిపల్ పరిధిలో గతంలో 20 వార్డులు ఉండగా.. సీతారాంపూర్, రాజీపేట విలీన గ్రామాలతో 22 వార్డులకు చేరుకున్నాయి. దీంతో పరకాల మున్సిపాలిటీ పరిధి జనాభా చాలా వరకు పెరిగింది. అదే స్థాయిలో అపరిశుభ్రత పెరిగింది. పెరిగిన జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య సిబ్బంది నియామకాలు మాత్రం ఇప్పటికీ చేపట్టలేదు.

వర్షాకాలం వస్తే వణుకు

4వ వార్డు పరిధి సగర వీధి కాలనీవాసులకు వర్షాకాలం వస్తే వణుకు పుడుతుంది. అస్తవ్యస్త డ్రెయినేజీలతో పై కాలనీల నుంచి వచ్చే చెత్తా, చెదారం ఈ కాలనీ వద్దే నిలుస్తోంది. దీంతో తీయడానికి మున్సిపాలిటీ సిబ్బందికే విసుగు పుడుతోంది. పారిశుద్ధ్య సిబ్బంది రాకపోతే కాలనీవాసులే డ్రెయినేజీలోని చెత్తను తీసుకోవాల్సిన దుస్థితి నెలకొంటోంది. సమస్యకు పరిష్కారం చూపించాలని ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా.. ఫలితం లేకుండా పోతోందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు.

డంపింగ్ యార్డును తలపిస్తున్న వడ్ల వాడ

ఖాళీ ప్రదేశాలు ఉన్న వారంతా ప్రహరీలు నిర్మించుకోవాలని మున్సిపల్ అధికారులు హెచ్చరిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవట్లేదు. 13, 14 వార్డుల పరిధిలోకి వచ్చే వడ్ల వాడ, బ్రాహ్మణవాడ, హరిత నగర్ కూడళ్లలో ఖాళీ ప్రదేశాల్లో ఎలాంటి ప్రహరీలు లేవు. కొందరు చెత్తా, చెదారం వేస్తూ.. డంపింగ్ యార్డుగా మార్చేశారు. సంబంధిత స్థల యజమానులపై లేదా చెత్త వేసే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవట్లేదు. పారిశుద్ధ్య సిబ్బంది సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోడ్లపైనే చెత్త పేరుకుపోతోంది.

పరకాల మున్సిపాలిటీ వివరాలు

పరకాల మున్సిపాలిటీ పరిధిలో 22 వార్డులు ఉండగా.. 34,318 జనాభా ఉంది. 95 కాలనీలున్నాయి. ఆయా కాలనీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు 80 మంది సిబ్బంది ఉండగా.. వారిలో నలుగురు జవాన్‌లు, 56 మంది పారిశుద్ధ్య సిబ్బంది, 20 మంది మున్సిపల్ స్వచ్ఛ వాహనాలు నడిపే డ్రైవర్లు ఉన్నారు.



గడ్డం వాడ కాలనీలో ఖాళీ స్థలంలో నిలిచిన నీరు



సగరవీధిలో ఇళ్ల ఎదుట, కాలనీ కూడలిలో పేరుకుపోయిన చెత్త

మేమే చెత్త తీసుకున్నాం..



వర్షం కాలం వచ్చిందంటే చాలా భయమేస్తుంది. వర్షపు నీరు కాలనీలోకి వస్తోంది. కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోతోంది. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవట్లేదు. దీంతో డ్రెయినేజీల్లోంచి మేమే చెత్త తీస్తున్నాం. ఎందుకంటే దోమ కాటు కారణంగా చిన్నారులు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీలోని డ్రెయినేజీలోని చెత్తాచెదారం తీయాలి.

\- అశోక్, సగరవీధి

ఇంకెన్నాళ్లు ఈకష్టాలు



మా కాలనీ ప్రధాన రహదారికి ఉండడమే పెద్ద శాపం. రోడ్లపై నిలుస్తున్న నీరు కాలనీకి చేరుకొని కంపుకొడుతోంది. కనీసం రోడ్లపై నుంచి నడవలేని పరిస్థితి. చాలాసార్లు అధికారులు చూసి పోవడమే కానీ.. శాశ్వత పరిష్కారం చూపించట్లేదు. దీంతో నరకం అనుభవిస్తున్నాం.

\- మూర్తి, గడ్డంవాడ

కమలాపూర్ చెరువును టూరిస్ట్ స్పాట్‌గా తీర్చిదిద్దుతా

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: కమలాపూర్‌ను మున్సిపాలిటీగా చేయడంతోపాటు పెద్ద చెరువును సిద్దిపేటలోని చిన్న కోమటి చెరువు మాదిరిగా టూరిస్ట్ స్పాట్‌గా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉచితంగా సరఫరా అయిన 3.33 లక్షల చేప పిల్లలను శనివారం ఆయన కమలాపూర్ పెద్ద చెరువులో వదిలారు. ఈసందర్భంగా కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్‌ల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. కమలాపూర్ మండల వ్యాప్తంగా సుమారు 18 లక్షల చేప పిల్లలను పెంపకం కోసం ఆయా గ్రామాల్లోని చెరువులో పోస్తున్నట్లు తెలిపారు. అనంతరం కమలాపూర్‌తో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని గణపతి మండపాలను సందర్శించి విఘ్నేశ్వరుడికి ప్రత్యేక పూజలు చేశారు. నిర్వాహకులకు రూ.5 వేల చొప్పున విరాళంగా అందజేశారు. కార్యక్రమాల్లో సర్పంచ్ విజయతిరుపతిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ సంపత్ రావు, వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, ఎంపీటీసీ వెంకటేశ్వర్లు, నాయకులు శ్రీకాంత్, ప్రదీప్‌రెడ్డి, రమేశ్, అశోక్, మురళి, సమ్మయ్య, వినోద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



కమలాపూర్ పెద్ద చెరువులో చేప పిల్లలను పోస్తున్న కౌశిక్‌రెడ్డి

విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా క్వాలిటీ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి

ఐనవోలు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా క్వాలిటీ ఎడ్యుకేషన్ కో–ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి కోరారు. శనివారం మండలంలోని పున్నేలు, ఐనవోలు, ఒంటిమామిడిపల్లి, వెంకటాపూర్, ఉడుతగూడెం గ్రామాల ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు కేజీబీవీని ఆయన సందర్శించారు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే(ఎస్ఈఏఎస్) పరీక్ష విధానాన్ని, పేరెంట్ టీచర్ మీటింగ్(పీటీఎం) సమావేశాలను పరిశీలించారు. ఈసందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎస్ఈఏఎస్ పరీక్ష వల్ల 3, 6, 9 తరగతుల విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకుని వారికి మరింత నాణ్యమైన విద్య అందించడానికి తోడ్పడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం కోసం ప్రభుత్వం ఎండీఎంలో 3 రోజులు గుడ్లు, మూడు రోజుల రాగిజావతోపాటు దసరా నుంచి ఉదయం అల్పాహారం అందించనున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతోపాటు మంచి భోజనం అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాలుగా కృషిచేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమాల్లో స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, హెచ్‌ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, ఆరోగ్యమ్మ, లింగారావు, రమేశ్, స్పెషల్ ఆఫీసర్ సునీత, వివిధ పాఠశాలల ఉపాధ్యాయలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చల్లా గో బ్యాక్ బోర్డులు పెడతాం

పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి

పరకాల: పరకాలను అమరవీరుల జిల్లా చేయకపోతే ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని పరకాలకు రావొద్దని హెచ్చరిక బోర్డులు పెడతామని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. పరకాల అమరధామంలో శనివారం ఆయన అమరవీరుల జిల్లా సాధన సమితి సభ్యులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా సాధన కోసం జైలు శిక్షను అనుభవించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. స్థానికుల కోరికను పట్టించుకోని ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డిని పరకాలకు రాకుండా తిరిగి వెళ్లిపోవాలంటూ గోవిందాపూర్ స్టేజీ వద్ద, కంఠాత్మకూర్ వంతెన వద్ద హెచ్చరిక బోర్డులు పెట్టేందుకు వెనుకడుగు వేసే ప్రసక్తే లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా సాధన సమితి కన్వీనర్ దుబాసి వెంకటస్వామి, కానుగుల గోపీనాథ్, సంఘం పురుషోత్తం, పాలకుర్తి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మొలుగూరి భిక్షపతి

ఓటరు జాబితా ప్రక్రియ పరిశీలన



దామెర తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో ఎన్నికల పరిశీలకులు శ్రీధర్

ఐనవోలు: వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలోని ఐనవోలు మండలంలో ఎన్నికల సంబంధిత పనులను జిల్లా ఎన్నికల అధికారులు పరిశీలించారు. శనివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఈ.శ్రీధర్ నేతృత్వంలో వరంగల్ జిల్లా అడిషనల్ కలెక్టర్, వర్ధన్నపేట రిటర్నింగ్ ఆఫీసర్ అశ్విని తానాజీ వాకడే, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీఓ వాసుచంద్ర ఐనవోలులో పర్యటించారు. ఓటరు నమోదు, తీసివేత, మార్పులు చేర్పులకు సంబంధించిన ఫారం 6, 7, 8లను ఎలా ప్రాసెస్ చేశారని బీఎల్ఓలను అడిగి తెలుసుకున్నారు. ఆయా లాగిన్‌ల ద్వారా ప్రాసెస్ చేసిన విధానాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తుల ప్రాసెస్ చేసిన విధానాన్ని అబ్జర్వ్ చేశారు. ఎన్నికల అంశాలపై రెవెన్యూ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. వారివెంట తహసీల్దార్ విక్రమ్‌కుమార్ ఉన్నారు.


ఓటరు జాబితాను సమర్థవంతంగా రూపొందించాలి

దామెర: ఓటరు జాబితాను సమర్థవంతంగా రూపొందించాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఈ. శ్రీధర్ అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓటరు నమోదు ఫారం 6, 7, 8 దస్త్రాల ప్రకియను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదు ప్రక్రియలో భాగంగా తప్పుల్లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరణించిన ఓటర్లను గుర్తించి జాబితా నుంచి తొలగించాలని సూచించారు. ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, అడిషనల్ కలెక్టర్ మహేందర్‌జీ, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ జ్యోతి వరలక్ష్మీదేవి, ఆర్ఐ భాస్కర్‌రెడ్డి, బీఎల్ఓలు ఉన్నారు.

ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధం కావాలి

హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: జిల్లాలో ఎన్నికలు పారదర్శకంగా, సమన్వయంతో నిర్వహించేందుకు అధికారులు సిద్ధం కావాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. శనివారం కలెక్టరేట్‌లో సీపీ రంగనాథ్, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి ఎన్నికల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటుహక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఓటింగ్ ప్రక్రియపై అధికారులు, సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన ఏర్పర్చుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మార్పులు, వసతులు యుద్ధప్రాతిపదికన చేయాలన్నారు. సీపీ రంగనాథ్ మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ సూచనలు పాటించాలని, మద్యం, డబ్బు, ఇతర ప్రలోభాల పంపిణీ నియంత్రణకు నిఘా బృందాలు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వరంగల్ అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డీసీపీ బారీ, డీఆర్ఓ వైవీ గణేశ్, రెండు జిల్లాల ఎక్సైజ్, పోలీస్, రెవెన్యూ అధికారులు ఉన్నారు.



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, పక్కన వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య, సీపీ రంగనాథ్, ఇతర అధికారులు

తహసీల్దార్లు పోలింగ్ కేంద్రాలు పరిశీలించాలి

ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు సజావుగా చేయాలని, వాటిని తహసీల్దార్లు స్వయంగా పరిశీలించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శనివారం కలెక్టరేట్‌లో మండల అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సదుపాయాల విషయంలో తగు నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, డీఆర్ఓ వైవీ గణేశ్, డీఆర్డీఓ పీడీ శ్రీనివాస్, డీఈఓ అబ్దుల్‌హై, ఇతర అధికారులు ఉన్నారు.

సర్పంచ్‌పై అట్రాసిటి కేసు

ఆత్మకూరు: ఆత్మకూరు సర్పంచ్ పర్వతగిరి రాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసినట్లు శనివారం సీఐ రవిరాజు తెలిపారు. మండలకేంద్రానికి చెందిన దుగ్యాల రమేశ్ ఆత్మకూరు గ్రామ శివారులో తనుగుల రామానుజం వద్ద కొనుగోలు చేసిన భూమిలో పందుల పెంపకం చేస్తూ జీవిస్తుండగా సర్పంచ్ రాజు పంచాయతీ సిబ్బందితో వెళ్లి కులంపేరుతో దూషిస్తూ జేసీబీతో షెడ్డును కూల్చాడు. ఈమేరకు రమేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సర్పంచ్ రాజుపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

తూర్పు కారులో ‘రివర్స్ గేర్’!

- ఎమ్మెల్యే నరేందర్ ఒంటెద్దు పోకడలతో పార్టీకి నష్టం
- పార్టీ మారతారని చేస్తున్న ప్రచారంలో నిజం లేదు
- కొందరు కార్పొరేటర్లను తన వైపునకు లాగి రాజకీయం చేస్తున్నారు..
- వారితో అనుకూల మాటలు మాట్లాడించి అధిష్టానానికి పంపే ప్లాన్
- మేం కూడా కేసీఆర్, కేటీఆర్‌ను కలిసి పరిస్థితులు వివరిస్తాం..
- మరోసారి రహస్యంగా భేటీ అయిన ఏడుగురు కార్పొరేటర్లు



సాక్షి, వరంగల్: వరంగల్ తూర్పు బీఆర్ఎస్ పార్టీలో ముసలం తారస్థాయికి చేరుకుంది. సిట్టింగ్ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తమ పార్టీకి చెందిన కొందరు కార్పొరేటర్లు పార్టీ మారుతారంటూ తన కున్న సామాజిక మాధ్యమాలు, మీడియా సెంటర్ ద్వారా ప్రచారం చేయించి ఇంకా అగ్నికి ఆజ్యం పోస్తున్నారనే విమర్శలొస్తున్నాయి. నాయకుడంటే అందరినీ కలుపుకొని పోవాలి కానీ తూర్పులో మాత్రం విచిత్ర పరిస్థితి నెలకొందని, అతను చెప్పిందానికి ఊ కొడితేనే సరి.. లేకపోతే పోలీస్‌స్టేషన్లలో లేనిపోని కేసులు నమోదవుతాయని, పార్టీ కార్యకర్తలని చూడకుండా పోలీసులతో కొట్టించిన సందర్భాలున్నాయని కొందరు కార్పొరేటర్లు వాపోతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే నరేందర్ ఎంత దుష్ప్రచారం చేసినా.. పార్టీని వీడేదే లేదని, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ నాయకత్వంలో ఎమ్మెల్యేగా ఏ అభ్యర్థిని రంగంలోకి దింపినా.. అతడికంటే నాలుగు రెట్లు ఎక్కువగా కష్టపడి గెలిపించేందుకు కృషి చేస్తామని ఘంటాపథంగా చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా శనివారం నగరంలోని ఓ ముఖ్య నేత ఇంట్లో తూర్పు బీఆర్ఎస్ ప్రధాన నాయకత్వంతోపాటు ఏడుగురు కార్పొరేటర్లు సమావేశమయ్యారు. వీరిలో గుండేటి నరేందర్ కుమార్, సయ్యద్ మసూద్, బైరబోయిన దామోదర్, సిద్ధం రాజు, బస్వరాజు శ్రీమాన్, ఆకుతోట శిరీశ్, బస్వరాజ్ కుమార్ ఉన్నారు.

ఒంటెద్దు పోకడలతో విరక్తి చెంది..

‘ఎమ్మెల్యే ఎవరైనా ఉదయం లేవగానే సమస్యలతో వచ్చే ప్రజల కోసం గ్రీవెన్స్ నిర్వహిస్తుంటారు. తూర్పులో అలాంటి పరిస్థితి లేదు. ఉదయం 11 గంటలు దాటితే గానీ ఇంటి నుంచి బయటకు రాని పరిస్థితి. ఎవరైనా వచ్చినా గంటల తరబడి వేచి చూసి ఎమ్మెల్యేని కలవకుండా వెళ్లిన సందర్భాలు అనేకం’ అని పలువురు కార్పొరేటర్లు చెబుతున్నారు. ఒకవేళ కలిసినా.. ఐదు నిమిషాల్లో ముగించి కారులో ఎక్కి కార్యక్రమాలు ఉన్నాయని వెళ్తున్నారన్న ప్రచారం ఉంది. కార్పొరేటర్లుగా ప్రజల నుంచి చివాట్లు చాలా ఎదురయ్యాయని, ఆయన ఒంటెద్దు పోకడలతో క్షేత్రస్థాయిలో బీఆర్ఎస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతోందని ఆరోపిస్తున్నారు. మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎంపీ పసునూరి దయాకర్ తదితర ముఖ్య నేతలను కూడా పట్టించుకోకుండా అంతా తానే అన్నట్టుగా వ్యవహరిస్తూ పార్టీని డిస్టర్బ్ చేస్తున్నారని, గతంలో ఇలాంటి ఘటనలు చాలా ఎదురయ్యాయన్న మాట వినిపిస్తోంది. అదే సమయంలో డివిజన్లలో కార్పొరేటర్లకు సమాన స్థాయిలో నలుగురు కార్యకర్తలను పెట్టుకుని, వారికి నెలనెలా జీతాలు ఇస్తూ కార్పొరేటర్లను డమ్మీలు చేసే వ్యవస్థను నెలకొల్పారని వాపోతున్నారు.

వారిని దగ్గరకు తీసి మార్కులు కొట్టేద్దామనుకుంటున్నారు..

తామేదో డబ్బుల కోసం ఆశపడుతున్నామన్నట్టుగా ప్రచారం చేస్తున్నారని, తమ డివిజన్లలో జరిగిన అభివృద్ధి పనుల్లో రావాల్సిన కమీషన్లు ఇవ్వకుండా కాంట్రాక్టర్ల వద్ద తీసుకున్న ఎమ్మెల్యే... శుక్రవారం కొందరికి ఇచ్చినట్టుగా తెలిసిందని వీరు అంటున్నారు. కేడాల జనార్దన్ హాజరైన గురు, శుక్రవారం సమావేశాల్లో నరేందర్ అభ్యర్థిత్వం మార్చాలని చెప్పిన రోజే.. అతడి భార్య కేడాల పద్మతోపాటు, పోశాల పద్మ, పల్లం పద్మ, కావేటి కవిత, మరిపల్లి రవి, దిడ్డి కుమారస్వామి ఎమ్మెల్యే నరేందర్‌ను కలిసి తమ పనులు చేసుకున్నారన్న ప్రచారం కోడై కూస్తోంది. వీరిచ్చిన సపోర్ట్‌తోనే ఎమ్మెల్యే నరేందర్ అధిష్టానం వద్ద మంచి మార్కులు కొట్టేదామనుకుంటున్నారని, వీరితో కావాలనే ఎమ్మెల్యే గొప్ప నాయకుడు అంటూ వాయిస్‌లు తీసుకున్నారని ప్రచారం సాగుతోంది. తాము ఉద్యమ సమయంలో ఆత్మగౌరవంతో బతికినవాళ్లమని, ప్రశ్నించినా కార్యకర్తలపై సొంత పార్టీ అని చూడకుండా కేసులు పెట్టించి మరీ చిత్రహింసలకు గురిచేశారని అసంతృప్తి కార్పొరేటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేసీఆర్, కేటీఆర్ నాయకత్వంలో సైనికుల్లా పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, ఎమ్మెల్యే అభ్యర్థి విషయంలో అధిష్టానం పునరాలోచన చేస్తే గెలుపు అవకాశాలు సులభంగా ఉంటాయని నిర్ణయానికి వచ్చారు. ఈమేరకు వీరి విజ్ఞాపనను అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని, అందరినీ కలుపుకొని పోయే నేతను ప్రకటించాలని కోరేందుకు సిద్ధమవుతున్నారు.

గిర్నిబావిలో పోలీసుల తనిఖీ..

- రూ. 18.90 లక్షల నగదు పట్టివేత


నగదును పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో శనివారం వరంగల్–నర్సంపేట ప్రధాన రహదారిపై సీఐ పూల్యాల కిషన్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టారు. కార్లు, ద్విచక్రవాహనాలు, లారీలు, జీపులను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో వరంగల్ నుంచి నర్సంపేట వైపునకు వెళ్తున్న టీఎస్ 04ఈజె6918 నంబర్ గల కారును ఆపి తనిఖీ చేయగా రూ. 15.60 లక్షల నగదు లభించింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కన్నెటి ప్రభాకర్‌రావు, లక్ష్మణ్‌రావును వివరణ కోరగా తాము మిర్చి వ్యాపారులమని, వరంగల్ నుంచి ఖమ్మం వెళ్తున్నామని చెప్పారు. అలాగే, కంచరకుంట్ల మురళీధర్‌రెడ్డి వాహనంలో రూ. 2లక్షలు, మల్లాది రాజేందర్‌రెడ్డి వాహనంలో రూ. 1.30లక్షలు లభించగా మొత్తం రూ. 18.90 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విషయం తెలుసుకున్న నర్సంపేట ఏసీపీ తిరుమల్ గిర్నిబావికి చేరుకుని నగదుపై ఆధారాలు చూపాలని సదరు వ్యక్తులను అడిగారు. అయితే వారు చూపిన ఆధారాలు నమ్మకంగా లేకపోవడంతో కేసు నమోదు చేయాలని సీఐ కిషన్‌ను ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడారు. పూర్తి ఆధారాలు చూపితే నగదును అందజేస్తామన్నారు. ఆధారాలు లేకుండా డబ్బుతో ప్రయాణించొద్దన్నారు. కార్యక్రమంలో దుగ్గొండి, నల్లబెల్లి, ఖానాపురం ఎస్సైలు జక్కుల పరమేష్, నగేష్, మధు, సిబ్బంది పాల్గొన్నారు.

అదును చూసి అపహరణ..

- తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ
- 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరణ
- ఘటనా స్థలిని పరిశీలించిన ఏసీపీ డేవిడ్‌రాజ్


ఘటనా స్థలిని పరిశీలిస్తున్న ఏసీపీ డేవిడ్‌రాజ్

ఎల్కతుర్తి : ఇంటి యజమాని అనారోగ్యానికి గురయ్యారు. దీంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఈ సమయంలో ఇంటి తాళం వేసి వెళ్లారు. ఇంకేముంది.. ఇదే అదునుగా భావించిన దుండగులు భారీ చోరీకి పాల్పడ్డారు. 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండిని అపహరించారు. దీంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. ఈ ఘటన భీమదేవరపల్లి మండలం కొత్తకొండ గ్రామంలో జరిగింది. ఎస్సై సాయిబాబు కథనం ప్రకారం గ్రామానికి చెందిన మంచాల వెంకటేశ్వర్లు అనారోగ్యానికి గురికాగ చికిత్స నిమిత్తం ఈనెల 12న హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. ఇదే అదునుగా భావించిన దుండగులు ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న 375 గ్రాముల బంగారం, 700 గ్రాముల వెండి అపహరించుకెళ్లారు. ఇదిలా ఉండగా చికిత్స పొందిన అనంతరం ఈ నెల 22వ తేదీన బాధితులు ఇంటివచ్చి చూడగా తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కాజీపేట ఏసీపీ డేవిడ్‌రాజ్, సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సాయిబాబు ఘటనా స్థలానికి చేరుకుని చోరీ జరిగిన తీరును పరిశీలించారు. అనంతరం బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టాస్క్‌ఫోర్స్ సీఐపై వరంగల్ సీపీకి ఫిర్యాదు

వరంగల్ క్రైం: టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం రాంబాబుపై అడ్వకేట్ కిషన్ కుమార్‌గౌడ్ శనివారం సీపీ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. రిటైర్డ్ డీఆర్ పరిటాల సుబ్బారావు భూమి విషయంలో తగదా రావడంతో టాస్క్‌ఫోర్స్ సీఐ రాంబాబు తన కార్యాలయంలో సుబ్బారావును ఇష్టా నూసారంగా మాట్లాడారు. దీనిపై కిషన్‌కుమార్‌గౌడ్, సుబ్బారావు సీపీకి ఫిర్యాదు చేశారు. స్పందించిన సీపీ రంగనాథ్.. ఇన్‌స్పెక్టర్ రాంబాబుపై విచారణకు ఆదేశించినట్లు సమాచారం.

మళ్లీ మొదటికి..

అభ్యర్థుల సమయం, శ్రమ బూడిదలో పోసిన పన్నీరే..

- ఇప్పటికే రెండుసార్లు రాసిన గ్రూప్–1 ప్రిలిమ్స్
- ఇప్పుడు మళ్లీ రద్దుతో విసిగిపోతున్న నిరుద్యోగులు
- కోచింగ్ కోసం వేలాది రూపాయలు ఖర్చు
- నిరుద్యోగిపై అదనపు భారం పడుతుందని ఆవేదన


పరీక్ష రాస్తున్న ఉద్యోగార్థులు(ఫైల్)

సాక్షి, మహబూబాబాద్/హనుమకొండ/వరంగల్: సుదీర్ఘ కాలం తర్వాత తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన గ్రూప్–1 ఉద్యోగాల భర్తీ పరీక్ష ఒక్క అడుగు ముందుకు.. నాలుగు అడుగులు వెనక్కి అన్నట్లు సాగుతోంది. సివిల్స్‌లో విఫలమైన వారు కొందరు.. ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగానికి సెలవు పెట్టి మరికొందరు.. యూనివర్సిటీలు, కోచింగ్ సెంటర్లలో ఏళ్ల తరబడి ఉంటూ.. ఉద్యోగం కోసమే జీవితం అన్నట్లు కఠోర శ్రమ చేస్తున్న ఇంకొందరు.. ఇలా అందరూ ఇప్పటికే రెండు సార్లు పరీక్ష రాసి మెయిన్స్ కోసం చదువుతున్నారు. ఈ నేపథ్యంలో 'గతంలో నిర్వహించిన ప్రిలిమ్స్ రద్దు చేస్తున్నాం. మళ్లీ రాయాలని' హైకోర్టు తీర్పు ఇవ్వడంపై కన్నీరుమున్నీరవుతున్నారు. మళ్లీ పరీక్ష మొదటి నుంచి రాయాలా అని నిస్సహాయత తెలియజేస్తున్నారు.

ప్రభుత్వ వైఫల్యానికి యువత బలి

సర్కారు.. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించడంలో విఫలమైంది. అసలు పరీక్ష పేర్లతో సంబంధం లేకుండా కొందరికి.. పేపర్‌ను లీక్ చేసి మరికొందరికి ఉద్యోగాలు ఇవ్వాలని చూసింది. అధికారుల నిర్లక్ష్యంతో పరీక్ష పేపర్లు అంగట్లో సరుకయ్యాయి. ఫలితంగా ఒకే పరీక్షను మూడు సార్లు రాయమని నిరుద్యోగులకు చెప్పి వారి సమయం, ధనం, శ్రమ వృథా చేస్తున్నారు. దీనికి ప్రభుత్వమే మూల్యం చెల్లించాల్సి ఉంటుందని యువత డిమాండ్ చేస్తోంది.

జూన్‌లో జరిగిన గ్రూప్–1 పరీక్షకు హాజరైన అభ్యర్థులు			
జిల్లా	మొత్తం	హాజరైంది	సెంటర్లు
వరంగల్, హనుమకొండ	21,038	13,929	55
భూపాలపల్లి	2369	1516	09
ములుగు	1,931	1,262	07
జనగామ	2330	1079	14
మహబూబాబాద్	4046	2663	13

సంవత్సరాల తరబడి చదువు

గ్రూప్–1 ఉద్యోగం సాధించాలని యువత భారీగా ఆశలు పెట్టుకుంది. ఇప్పటికే ఉపాధ్యాయులు, ఎస్సైలు, కానిస్టేబుళ్లు, ఐసీడీఎస్, ఏసీటీవోలతోపాటు వివిధ కేటగిరీల్లో ఉద్యోగాలు చేసేవారు. గ్రూప్–1 నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి ఉద్యోగాలకు సెలవు పెట్టి లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుతున్నారు. అదేవిధంగా ఉద్యోగ సాధనే ధ్యేయంగా నాలుగు పదుల వయసువచ్చినా..పెండ్లి చేసుకోకుండా యూనివర్సిటీల్లో పాగావేసి గడ్డం, మీసాలు పెంచుకొని కొందరు.. నెత్తిపై ఉన్న వెంట్రుకలు రాలిపోయే అంత టెన్షన్‌తో మరికొందరు చదువుతున్నారు. ఇందుకోసం కోచింగ్ సెంటర్లు, మెటీరియల్స్ కోసం లక్షలాది రూపాయలు అప్పులు చేసిన వారు కూడా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ ప్రిలిమ్స్ రద్దు అంటే అందరి జీవితాలతో ఆడుకోవడమే.

టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి



గ్రూప్–1 రద్దు అత్యంత బాధాకరం. ఇప్పటికి రెండుసార్లు రాసిన. మళ్లీ రాయాల్సిన పరిస్థితి రావడం దారుణం. దీనిపై ప్రభుత్వం స్పందించి టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి. లేదా కమిషన్ చైర్మన్ తొలగించి నూతన నోటిఫికేషన్ జారీ చేయాలి.

– మారపాక కిశోర్, కురవి

ఆసక్తి సన్నగిల్లుతోంది



రెండోసారి గ్రూప్–1 ప్రిలిమ్స్ రద్దు వల్ల చదువుకోవాలనే ఆసక్తి సన్నగిల్లుతోంది. ఇంత అధ్వానంగా పరీక్షలు నిర్వహించడాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. ఇప్పటి వరకు రూ.3 లక్షలు ఖర్చయ్యాయి. టీఎస్‌పీఎస్సీ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది.

– తిరుపతి రెడ్డి, గణపురం, భూపాలపల్లి

ఆశ చచ్చిపోయింది



నేను ఉపాధ్యాయుడిని. కొంతకాలంగా గ్రూప్–1 పరీక్షలకు సిద్ధమవుతున్న. ఈ క్రమంలో మరోసారి గ్రూప్–1 రద్దు కావడం వల్ల ఉద్యోగం సాధించాలనే ఆశ చచ్చిపోయింది. ఉన్నత ఉద్యోగాల భర్తీలో ఇలా జరగడం ప్రభుత్వం, టీఎస్‌పీఎస్సీ చిత్తశుద్ధి కనిపిస్తోంది.

– పి.చక్రపాణి, వరంగల్

ఒక్క పరీక్షను ఎన్నిసార్లు రాపిస్తారు



ఒక్క గ్రూప్–1 ప్రిలిమ్స్‌ను ఎన్నిసార్లు రాపిస్తారు.. ఇది ప్రభుత్వమేనా.. నిర్వహించేవి ఉద్యోగాల భర్తీ పరీక్షేనా.. గ్రూప్–1 పరీక్ష రద్దడం అత్యంత దారుణం. వరుసగా విఫలమవుతున్న ప్రభుత్వానికి యువత బుద్ధి చెబుతారు.

– ఆవుల వేణు, మహబూబాబాద్

నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు



గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న తరుణంలో టీఎస్‌పీఎస్సీ నిర్వహించిన పరీక్షను హైకోర్టు రద్దు చేసింది. ఈ పరిణామం మానసికంగా ఆందోళనకు గురి చేసింది. పరీక్షకు మళ్లీ సన్నద్ధం కావాలంటే క్లిష్ట పరిస్థితులను ఎదుర్కోవాలి. కొందరు చేసిన తప్పిదాలకు లక్షలాది మంది నిరుద్యోగులు రోడ్డున పడుతున్నారు.

– బెల్లపురి సాయికుమార్, జనగామ

మళ్లీ మొదటి నుంచి చదవాలి



గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చి రెండేళ్లు దాటింది. నోటిఫికేషన్ వచ్చినప్పటి నుంచి కోచింగ్‌కు వెళ్లి పరీక్ష రాస్తున్నాం. ఇప్పటి వరకూ పూర్తి కాలేదు. పరీక్షలు ఇప్పటికే రెండు సార్లు రద్దు అయ్యాయి. దీంతో మళ్లీ రాయాలంటే మొదటి నుంచి చదవాలి. ఉద్యోగాలు ఇవ్వొద్దని ఉద్దేశంతోనే ఇదంతా జరుగుతున్నట్లు అనిపిస్తోంది.

– కె.శ్రీజిత, విద్యార్థిని, హనుమకొండ

కూలికి వెళ్లొస్తా..జాగ్రత్త బిడ్డా..!

కూతురికి జాగ్రత్తలు చెప్పి పనికి వెళ్తూ మహిళ దుర్మరణం..

- నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు ప్రమాదం.. అక్కడికక్కడే మృతి
- మరో ఇద్దరికి స్వల్ప గాయాలు
- 108లో ఎంజీఎంకు తరలింపు


ఘటనా స్థలిలో మహిళ మృతదేహం

ఖిలా వరంగల్: జాగ్రత్తగా బడికి పోయిరా.. కూలికి వెళ్లొస్తా అంటూ ..బిడ్డకు జాగ్రత్తలు చెప్పి పనికి బయల్దేరిన మహిళను మృత్యువు.. ఆర్టీసీ బస్సు రూపంలో కబలించింది. ఈ ఘటన వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో జరిగింది. ఆర్టీసీ బస్సు అదుపు తప్పి ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో దంపతులు స్వల్పగాయాలతో బయటపడగా, ఓ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ముగ్గురు ఒకే కుటుంబానికి చెందిన వారు కావడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం చెన్నారావుపేట మండలం సమీప గ్రామాలకు చెందిన బానోతు సుజాత, బాలు దంపతులు బతుకుదెరువు కోసం ఐదేళ్ల క్రితం హనుమకొండ వడ్డేపల్లికి చేరుకున్నారు. ఇక్కడే ఉంటూ భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తూ ఇద్దరి పిల్లలను చదివించుకుంటున్నారు. బానోత్ సుజాత సొంత అక్క భూక్య బుజ్జీ (35). బుజ్జీ తన భర్తకు దూరంగా ఉంటూ తన ఇద్దరు కూతుళ్లను తీసుకుని మూడేళ్ల క్రితం వడ్డేపల్లికి చేరుకుంది. పెద్ద కూతురు భాను 7వ తరగతి చదువుతుండగా చిన్న కూతురును బంధువులకు దత్తత ఇచ్చింది. ఈ క్రమంలో సుజాత, బాలు, బుజ్జీ ముగ్గురు కలిసి ఒకే ద్విచక్రవాహనంపై భవన నిర్మాణ పనికి వెళ్తుంటారు. రోజువారీగానే శనివారం ఉదయం 9 గంటల సమయంలో ఒకే బైక్‌పై వడ్డేపల్లి నుంచి మామునూరుకు బయలుదేరారు. ఈ క్రమంలో వరంగల్–ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ సమీపంలో వరంగల్ నుంచి తొర్రూరు వైపునకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు.. బైక్‌ను ఢీకొంది. దీంతో భార్యాభర్తలు సుజాత, బాలు రోడ్డుపై పడిపోగా.. బుజ్జీ బస్సు వెనక టైర్ కింద పడింది. దీంతో అక్కడికక్కడే దుర్మరణం చెందింది. స్వల్పగాయాలతో బయటపడిన భార్యాభర్తలను స్థానికులు వెంటనే 108లో ఎంజీఎం తరలించారు. ఈ విషయం తెలిసిన మృతురాలి కుమార్తె భాను.. తల్లి మృతదేహంపై పడి కన్నీరు మున్నీరుగా విలపించింది. రోడ్డు ప్రమాద విషయం తెలియగానే మామునూరు ఎస్సైలు కృష్ణవేణి, ప్రమోద్‌కుమార్ హుటాహుటినా ఘటనా స్థలికి చేరుకున్నారు. మహిళ మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీకి తరలించారు. అనంతరం మృతురాలి బంధువు బాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సైలు తెలిపారు.

పెద్ద దిక్కు కోల్పోయి..

హన్మకొండ వడ్డేపల్లిలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న భూక్య బుజ్జీ(35).. భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తూ కుమార్తెను చదివిస్తోంది. తన కూతురును ఉన్నతంగా చూడాలకుంది. ఇంతలోనే కనిపించని లోకాలకు వెళ్లింది. బిడ్డను బడికి సాగనంపి చెల్లి, మరిదితో కలిసి బైక్‌పై బయల్దేరిన బుజ్జీ.. కొద్ది నిమిషాల్లోనే రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. దీంతో కూతురు 7 ఏళ్ల చిన్నారి భాను పెద్దదిక్కును కోల్పోయింది.

డ్రైవర్‌ను చితకబాదిన బాధితులు

అతివేగంగా.. నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే రోడ్డు ప్రమాదం జరిగిందంటూ ఆగ్రహానికి లోనైన బాధితులు, స్థానికులు.. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌ను చితకబాదారు. వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని బాధితులు, స్థానికులను ఘటనా స్థలి నుంచి దూరంగా పంపించడంతో గొడవ సద్దుమణిగింది.

మహిళా కార్మికులపై వేధింపులు అరికట్టాలి


మాట్లాడుతున్న రజిత

హన్మకొండ: సంఘటిత, అసంఘటిత రంగాల్లో మహిళా కార్మికులపై జరుగుతున్న వేధింపులను అరికట్టాలని సీఐటీయూ అనుబంధ శ్రామిక మహిళా హనుమకొండ జిల్లా కన్వీనర్ ఎస్.రజిత అన్నారు. హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో శ్రామిక మహిళా జిల్లా సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా కార్మికులపై పురుష కార్మికులు, యజమాన్యాలు ద్వంద్వర్థాల మాటలతో వేధింపులకు గురి చేస్తూ అనేక విధాలుగా హింసకు గురి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేధింపులకు పాల్పడుతున్న వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదస్సులో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య, యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకన్న, భూక్య సునీత పాల్గొన్నారు.

పటిష్ట జాబితాను సిద్ధం చేయండి..

వరంగల్ అర్బన్: వరంగల్ తూర్పు నియోజకవర్గంలో పటిష్ట ఓటరు జాబితాను రూపొందించాలని ఎలక్టోరల్ రోల్ అబ్జర్వర్, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్ సూచించారు. శనివారం బల్దియా కార్యాలయంలో వరంగల్ తూర్పు, అసెంబ్లీ ఓటర్ల జాబితాపై ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, బీఎల్‌ఓలతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన పోలింగ్ బూత్‌ల వారీగా ఆయా ఓటరు నమోదు, మార్పులు చేర్పుల గురించి అడిగి తెలుసుకున్నారు. సమీక్షలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధాశుక్ల, తహసీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల వ్యతిరేక ప్రభుత్వాలను ఓడించాలి

- రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి


మాట్లాడుతున్న ఆకునూరి మురళి

నయీంనగర్: పేదల వ్యతిరేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఓడించాలని రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి పిలుపునిచ్చారు. శనివారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణలో అవినీతి, ఆర్థిక దోపిడీ రాజకీయాలను ఓడించాలని జాగో తెలంగాణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కులాలు, మతాల వారీగా విభజన రాజకీయాలు చేస్తున్నాయని, వాటిని ఓడించాలన్నారు. రాష్ట్రంలో పేదరికం, నిరుద్యోగం, అవినీతి పెరిగిపోయిందని, ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశాన్ని ప్రైవేట్‌కు అప్పగిస్తోందని, ప్రధాని మోదీ నిర్ణయాలను తిప్పికొట్టాలన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి పథకాల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారన్నారు. విద్యారంగాన్ని నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని రూ. 5 లక్షల కోట్ల అప్పుతో లూటీ చేశారని మండిపడ్డారు. రిటైర్డ్ జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రైతు ఆత్మహత్యలు, నిరుద్యోగం పెరిగిపోయిందని, ప్రజల్లో సమానత్వం లేదన్నారు. అవినీతి లేని సమాజాన్ని నిర్మించడానికి యువత మేలుకోవాలన్నారు. దేశంలో 70 శాతం ఎమ్మెల్యేలు దోచుకోవాలనే ఆలోచనతోనే ఉన్నారని, ప్రజల సంక్షేమం వారికి పట్టదన్నారు. దేశ అసలు జీడీపీ 4.8 అయితే దానిని పెంచి 7.8గా అసత్యప్రచారం చేస్తున్నారన్నారు. ప్రొఫెసర్ వినాయకరెడ్డి, కూరపాటి వెంకటనారాయణ మాట్లాడుతూ దేశం మొత్తంలో తెలంగాణ చదువులు లాస్ట్.. తాగడంలో ఫస్ట్ అన్నారు. తెలంగాణలో యువకులను తాగుడుకు బానిసలు చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు యాదగిరిచార్యులు, పద్మజాషా, లక్ష్మీనారాయణ, డా.పృథ్వీరాజ్, సైకిబాబు, రమ, గోవర్ధన్ పాల్గొన్నారు.

రుద్రేశ్వరాలయ గణపతికి ఘన చరిత్ర

- ఇక్కడ నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత
- 55 సంవత్సరాల నుంచి నిర్వహణ..
- నిమజ్జనోత్సవ రథానికి వేలాది భక్తుల మంగళహారతులు

హన్మకొండ కల్చరల్ : స్వాతంత్రోద్యమంలో ప్రజలను ఏకం చేయడానికి లోకమాన్య బాలగంగాధర్ తిలక్ మహారాష్ట్రలో గణేష్ ఉత్సవాలు ప్రారంభించారు. ఈ ఉత్సవాల ద్వారా ప్రజలు చైతన్యం పొంది ఆంగ్లేయులపై పోరాడారు. అలాగే, ఈ ఉత్సవాలు నైజాం ప్రాంతాన్నీ ప్రభావితం చేశాయి. నైజాంకు వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర్య పోరులో ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చాయి. ఆ స్ఫూర్తితో తెలంగాణలోని వరంగల్ జిల్లాలో కూడా ప్రారంభించారు.

వేయిస్తంభాల దేవాలయంలో..

హనుమకొండలోని వేయిస్తంభాల దేవాలయంలో జరిగే గణపతి నవరాత్రి ఉత్సవాలకు ప్రత్యేకత ఉంది. అలాగే, నిమజ్జనానికి కూడా ప్రత్యేక ఉంది. ఈ రోజున ఆలయంలో నిమజ్జనోత్సవ రథాన్ని దర్శించుకోవడానికి ప్రజలు మంగళహారతులతో ఎదురుచూస్తారు. వేలాది మంది భక్తులు వినాయకుడిని దర్శించుకుంటారు. పబ్లిక్‌గార్డెన్ వద్ద నిర్వహించిన గణేష్ ఉత్సవాలను 55 సంవత్సరాల క్రితం వేయిస్తంభాల దేవాలయానికి మార్చగా అప్పటి నుంచి గజానన మండలి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఏటా దాతల సహకారంతో గణపతి విగ్రహాన్ని ఆలయంలో ప్రతిష్టిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా రోజూ గణపతి రుద్రహోమం, వేలాది మంది భక్తులకు అన్నప్రసాదాల వితరణ జరుగుతోంది. అలాగే, దేవాలయంలోని కాకతీయుల కాలం నాటి మూలమహాగణపతిని వివిధ రూపాల్లో అలంకరించి పూజలు నిర్వహిస్తారు. ఉత్సవాల సందర్భంగా రుద్రేశ్వరస్వామి వారికి అన్నపూజలు నిర్వహిస్తారు. జిల్లా యంత్రాంగం, నగరపాలక సంస్థలు ఏర్పాట్లు చేస్తాయి. రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతాయి.

ఏటా వైభవంగా ఉత్సవాలు..



ఉత్సవాల్లో తొమ్మిది రోజులు గణపతి, రుద్ర హోమాలు, మూలమహాగణపతికి అలంకరణలు జరగడం ఇక్కడి ప్రత్యేకత. వినాయకుడి పంచలోహ ఉత్సవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి ఆలయ చుట్టూ పల్లకీసేవ నిర్వహిస్తాం. దాతల సహకారంతో ఏటా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం.

గంగు ఉపేంద్రశర్మ, ప్రధానార్చకుడు, వేయిస్తంభాల ఆలయం

దళితులను దగా చేస్తున్న సీఎం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్

నయీంనగర్: సీఎం కేసీఆర్ హామీలు నీటి మూటలేనని, 17లక్షల మంది దళితులకు దళితబంధు పథకం అమలు చేయకుండా వారిని దగా చేస్తున్నారని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ విమర్శించారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళితబంధు కింద మంజూరైన యూనిట్‌ను అమ్మి ఐదుగురు పంచుకోవాలని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. వర్ధన్నపేటలో దళిత ఎమ్మెల్యే ఉండికూడా దళితులకు అన్యాయం జరుగుతోందని వాపోయారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చిటూరి అశోక్ కుమార్, బన్న ప్రభాకర్, విజయ్ కిరణ్, బల్లె విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

BIRTHDAY GREETINGS



REAL ESTATE

PLOT FOR SALE

- వరంగల్ గ్రేన్ మార్కెట్ దగ్గర 1233.42 sq.yards & 260 sq. yards 2 Plots 2 side రోడ్స్ గలవి అమ్మబడును. (మెయిన్ రోడ్ మొగిలిచర్ల 100 ఫీట్ల రోడ్డు) సంప్ర॥ 7671916416, 9393379778. [W-1229436]

FLAT FOR SALE

- హన్మకొండ జూపార్క్‌కు 300 మీటర్ల దూరంలో ఫాల్ సీలింగ్, లిఫ్ట్, జనరేటర్ సౌకర్యంతో కేవలం రూ.55 3BHK ఫ్లాట్ అమ్మబడును. Ready to move. VRR TULP గలది. సెల్: 6309840767. [WA-7229]

HOUSE FOR SALE

- హన్మకొండ, రాంనగర్‌లో Each Floor 1800 sft తో (260 గ॥లు)G, 1,2 / north face full ఇంటీరియర్ ఉన్న ఇల్లు అమ్మబడును. రేటు 2.3 Cr. Negotiable సంప్ర॥ 8712376150. [WA-7233]
- వరంగల్, మట్టెవాడలోని రేకులపల్లి వాడలో తూర్పు ముఖముతో గల పాత ఇల్లు 113 Sq. yards పక్కా రిజిస్ట్రేషన్ గలది అమ్మకమునకు కలదు. సంప్ర॥ 8331888842. [W-1229433]

షాప్ కిరాయికి ఇవ్వబడును

- నెహ్రూ పార్క్ దగ్గర స్టేషన్ రోడ్, జనగామలో షాప్ కిరాయికి ఇవ్వబడును వెడల్పు 11 1/2 ఫీట్లు పొడవు 38 ఫీట్లు with Furnicher. Cell: 8096302961. [W-1220759]

COMMERCIAL SALE

- Commercial Property for Sale Land Building 1428 Sq.yds 24500 Builtup Area at Saidabad,Hyd. Rent getting 5 Lakhs. Ph: 9849090098 [HA-346]

SERVICES

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

- మీయొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు, సెల్: 9849145043. [W-1229405]

LOANS

- బాలాజీ లోన్స్: మార్టిగేజ్ లోన్స్, పర్సనల్ లోన్స్, బిజినెస్ లోన్స్, IT రిటర్న్స్ (GST) చేయబడును. కాకతీయ టాకీస్, వరంగల్. ప్లాట్స్ కొనుగోలుపై ఇవ్వబడును. సంప్ర: 8522825358. [WA-7223]



BUSINESS OFFER

- రాజకీయ రంగంలో అవకాశం, ఎదగాలనే తపనగల స్త్రీ/పు, జనసేవకులు కావలెను. ఆర్థిక సహకారం లభించును. ఫోన్ : 7386275652, 7386425653 [H-793401]
- ప్రతి వ్యాపార వేత్త ఎదుగుదలకు గొప్ప అవకాశం మీ వ్యాపారాన్ని సులువుగా గుర్తింపు (బ్రాండ్) పొందడానికి అనుకూలమైన అతిపెద్ద ప్లాట్ ఫారమ్ కొరకు సంప్ర: 8143514395. [H-788375]

HOME CARE SERVICE

- రామకృష్ణ ఓల్డేజ్ హోమ్ (AP No.1) 24 గం॥ వృద్ధులను, పేషెంట్ల సేవకు, బేబీకేర్, ఇంటిపని, వంటపనికి పని మనుషులను మీ ఇంటికి పంపగలము ✆ 95420 855 88, 95423 05588 [B-1206740]

WANTED

- బాయ్స్ and గర్ల్స్ కావలెను చదువు అనుభవం అవసరం లేదు ఉచిత వసతి జీతం: 10000/– నుండి 15000/– వరకు. సెల్: 9849316058, 8247423557. [W-1229435]
- జయకృష్ణ ఫార్మసిలో పనిచేయుటకు అనుభవం గల ఫార్మసిస్ట్ కావలెను. ఫార్మసి సర్టిఫికేట్ ఉండాలి. పద్మాక్షి టెంపుల్ రోడ్, హన్మకొండ. సెల్ నెం: 8520027600. [WA-7234]
- శ్రీ సంతోష్ ట్రాక్టర్స్ సోనాలిక షోరూం మహబూబాబాద్, తొర్రూర్ బ్రాంచిలో పనిచేయుటకు టెలికాలర్స్, రిసెప్షనిస్ట్, సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఆకర్షణీయమైన జీతం, ఇన్సెంటివ్స్ TA+DA ఇవ్వబడును. సంప్ర॥ 9701345204. [W-189177]
- వరంగల్ స్టేషన్‌రోడ్‌కు గల విష్ణు లాడ్జిలో పని చేయుటకు రూమ్ బాయ్స్ కావలెను. జీ॥ 8000/– మరియు మేనేజర్ ఒక్కరు– జీ॥ 10000/– ఇవ్వబడును. సంప్ర॥ 9391864657 [W-1229414]
- Wanted MBBS / BAMS/BHMS duty doctors, B.Sc, GNM Nursing Staff X Ray Technicians and Receptionists for a Hospital at Hanamkonda. Cont: 9000282025, 9390672891. [W-1002850]
- రామకృష్ణ గ్రూపు, విజయవాడ, హైదరాబాద్ కొరకు శ్రీమంతుల ఇళ్లలో ముసలి వారికి సేవ చేయుటకు ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు 10th P/F, 19-30 సం. వర్కర్స్ కావలెను. భో+ వ+ జీ. 18 to 21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు. ✆ 86397 56226, 86397 56219 [B-1068113]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP No.1) విజయవాడ శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవచేయుటకు M/F కావలెను. భోజనం + వసతి కలదు. జీ. 15–16వేలు. ✆ 8247500792, 8247500683. [B-1206730]
- Male Only Marketing Executives - For Ready Mix Concrete Any degree, Accountants - Any Degree with Tally, Site Supervisors - Diploma / B.Tech Civil with for all 2-4 Yrs Exp. Drop your Resume on WhatsApp & Contact No: 7330891166, 8555890439, 9849277408 [WA-13357]
- వరంగల్ పోచమ్ మైదాన్ ఏరియాలో ప్రముఖ ఎలక్ట్రానిక్ షోరూమ్ నందు పని చేయుటకు హెల్పర్స్ (బాయ్స్) అర్జెంటుగా కావలెను. 9గం. డ్యూటీ 4 వీక్లీ ఆఫ్స్. ESI+ PF మంచి జీతం సంప్ర: 9032153413 [H-788684]
- Wanted Reporters in Each Mandal. All The Districts, Immediate Appointment @ swathi news. Ph : 7997733373 [H-788318]
- మీరు ఉన్నచోట నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో నెలకు 35,000/– వరకు సంపాదించవచ్చు. పార్ట్/ ఫుల్ టైం. ఎటువంటి ఫీజులు లేవు. ఫోన్: 85001 48297. [V-797408]
- గాయత్రి గ్రూపు, VJA, HYD శ్రీమంతుల ఇళ్ళలో వృద్ధుల సేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15 to 22 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 62812 08600, 6281208656 [B-1068117]
- మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైం వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-751693]
- త్రివేణి హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి+భోజనం. జీతం:18K. Ph : 9848571888 / 9640400073. [H-189335]
- రామకృష్ణ ఓల్డేజ్ హోం (TS.No.-1) హైదరాబాద్‌లో శ్రీమంతుల ఇండ్లలో ముసలివారికి సేవ చేయుటకు M/F కావలెను. భోజనం + వసతి + జీతం 15–16వేలు. ఫోన్: 9618221160, 9133271122 [H-788535]

LAND FOR SALE

- రెండు ఎకరాల వ్యవసాయ భూమి అమ్మకానికి కలదు. Near వంగపల్లి క్రాస్ రోడ్, గ్రా॥ లక్ష్మిపూర్, పరకాల – హుజురాబాద్ హైవే, మం॥ కమలాపూర్, జిల్లా హన్మకొండ. 8121374317. [W-189178]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/–రూ॥ అదనపు లైను 60/– రూ॥ మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9010144453
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.